

2

## ఉద్యమకారుల ముందస్తు అరెస్ట్


2

## ప్రభుత్వం వెంటనే వడ్లు కొనాలి



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com

15-5-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## న్యాయ సహాయ కౌన్సిల్‌గా నాగం సాయిబాబు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి జెఎఫ్‌సీఎం కోర్టుకు లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా న్యాయవాది నాగం సాయిబాబు నియమితులయ్యారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కామారెడ్డి ఆధ్వర్యంలో మూడేళ్ల కాలపరిమితికి గాను ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పేదలు, బలహీనవర్గాలకు ఉచిత న్యాయ సాయం అందించేందుకు న్యాయ సేవాధికార సంస్థ లీగల్ ఎయిడ్ కౌన్సిళ్లను నియమించింది. ఈ నియామకంపై న్యాయవాది సాయిబాబును తోటి న్యాయవాదులు, న్యాయ సిబ్బంది, స్థానిక ప్రజలు అభినందించారు. న్యాయ సేవలను పేదల చెంతకు చేర్చేందుకు కృషి చేస్తానని సాయిబాబు తెలిపారు.

# ఏడింటికే ఏరులై..

- ఉదయమే బార్లా తెరుస్తున్న కల్లు దుకాణాల నిర్వాహకులు
- యథేచ్ఛగా కల్తీ కల్లు విక్రయం
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

**జిల్లాలో కల్తీ కల్లు ఏరులై పారుతోంది. ఈత, తాటి చెట్లు లేకున్నా.. వివిధ రకాల మత్తు పదార్థాలతో కల్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. అయితే ఉదయం నుంచే వీరి దందా మొదలు అవుతోంది. దీనికి అలవాటు పడిన ప్రజలు బ్రష్ చేయగానే కల్లు దుకాణాలకు బారులు తీరుతున్నారు. పలు గ్రామాల్లో ఉదయాన్నే కల్లు దుకాణాల ముందు ప్రజలు బారులు తీరుతున్న దృశ్యాలు ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలు కాగితాలకే పరిమితమై, ఉదయం 7 గంటలకే కల్లు ఏరులై పారుతోంది.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కల్లు దుకాణాలు ఉదయం 10 గంటల తర్వాతే తెరవాలి. కానీ జిల్లాలోని పలు గ్రామాల్లో పరిస్థితి భిన్నంగా ఉంది. తెల్లవారుజాము 5 గంటల నుంచే చెట్లపై నుంచి కల్లు దించి, ఉదయం 7 గంటల నుంచే విక్రయాలు మొదలుపెడుతున్నారు. కూలీలు, రైతులు పొలం పనులకు వెళ్లే ముందే కల్లు తాగి వెళ్లే పరిస్థితి నెలకొంది. దాంతో వయసుతో సంబంధం లేకుండా కల్లుకు బానిసలవుతున్నారు.

### బ్రష్ చేయగానే..

పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉదయమే లేచి పనుల్లో నిమగ్నం అవుతారు. పొద్దున లేచి బ్రష్ చేయగానే టీ బదులు కల్లు సీసా చేతపట్టే వ్యక్తులు ఈరోజుల్లో ఎక్కువైపోయారు. ఉదయం 7 గంటలకే దుకాణాల్లో సైతం కల్లు అందుబాటులో ఉండడంతో చాలా మంది దుకాణాలకు దారి పడుతున్నారు. యువత నుంచి వృద్ధుల వరకు ఉదయాన్నే కల్లు దుకాణాలకు క్యూ కడుతున్నారు. ఇది దినచర్యగా మారడంతో కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా చితికి పోతున్నాయి. పనిచేసే సామర్థ్యం తగ్గి, మధ్యాహ్నానికే మత్తులో జోగుతున్నారు.

### నిద్రమత్తులో ఎక్సైజ్ శాఖ

కల్లు దుకాణాల వేళలు, కల్తీపై నిఘా పెట్టాల్సిన ఎక్సైజ్ శాఖ పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఫిర్యాదులు చేసినా తూతూమంత్రంగా తనిఖీలు చేసి వెళ్లిపోతున్నారని గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు నెలవారీ మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలున్నాయి. అందుకే చర్యలు లేవని బహిరంగంగానే విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా అధికారులు నిద్రమత్తు వీడి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఉదయం 10 గంటలలోపు తెరిచే దుకాణాలపై దాడులు చేసి లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### మత్తు కోసం కల్తీ బాటలో..

సహజమైన తాటి, ఈత కల్లుకు డిమాండ్ ఎక్కువ. కానీ కొందరు వ్యాపారులు త్వరగా మత్తు ఎక్కాలని కల్తీకి పాల్పడుతున్నారు. క్లోరల్ హైడ్రేట్, డైజోపామ్, అల్ప్రాజోలం వంటి మత్తు మందులు కలుపుతున్నట్లు ఆరోపణలున్నాయి. సరిపడా మత్తు లేకపోతే ప్రజలు సైతం గొడవకు దిగే పరిస్థితులు గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్నాయంటే ప్రజలకు మత్తు ఎంతలా అలవాటు చేశారో అర్థం అవుతోంది. దాంతో మత్తు కలపడం తప్పడం లేదని కల్లు దుకాణాల నిర్వాహకులు చెప్పడం గమనార్హం.



## జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా ముందుకెళ్దాం: డీఆర్‌వో గీత



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా ముందు కెళ్దామని డీఆర్‌వో గీత అన్నారు. ఇటీవల ఆమె జిల్లా రెవెన్యూ అధికారిణిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం టీఆర్ఈఎస్ఏ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని డీఆర్‌వో ఛాంబర్‌లో శుక్రవారం ఆమెను మర్యాదపూర్వకంగా అసోసియేషన్ ప్రతినధులు, ఉద్యోగులు కలిశారు. తనను సన్మానించిన టీఆర్ఈఎస్ఏ జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, కార్యదర్శి ప్రశాంత్ కుమార్, అసోసియేషన్ ప్రతినిధులకు డీఆర్‌వో కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా ముందుకు వెళ్దామని సూచించారు. ఎలాంటి సమస్య వచ్చిన తాను ముందుండి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డీఆర్‌వోను కలిసిన వారిలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ భూపతి ప్రభు, వినయ్ సాగర్, శైలజ, బోధన్ డివిజన్ అధ్యక్షుడు విఠల్, కార్యదర్శులు కార్తీక్ రెడ్డి నజీరుద్దీన్, తహశీల్దార్లు శ్రీధర్, వెంకటరమణ, శాంత, కిరణ్మయి, నరేష్, కోశాధికారి సంపత్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ విజయరామరాజు, నాయబ్ తహశీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు, జీపీవోలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్‌కు ఘన స్వాగతం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం జిల్లాకు విచ్చేశారు. ఆయనతో పాటు కమిషనర్లు దేశాల భూపాల్, పీవీ శ్రీనివాస్ సైతం జిల్లాకు విచ్చేయగా వారిని రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. వీరు జిల్లాలో సమాచార హక్కు చట్టం 2005పై పీఐవోలు, ఏపీఐవోలు, అన్ని శాఖల అధికారులకు అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు ప్రశాంత్, సతీష్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల సేవలను వినియోగించుకోవాలి: ధన్‌పాల్



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని సుభాష్‌నగర్‌లో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాధితులు అనవసరంగా ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి అప్పుల పాలు కావద్దన్నారు. ప్రభుత్వపరంగా అనేక ఆస్పత్రులు నాణ్యమైన చికిత్సలు అందజేస్తున్నాయని వివరించారు. జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సరైన చికిత్స అందుకుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం బీబీనగర్‌లో ఏర్పాటుచేసిన ఎయిమ్స్‌లో అత్యాధునిక చికిత్సలను అందజేస్తున్నారని ఎమ్మెల్యే తెలియజేశారు. అలాగే నిమ్స్‌లోనూ చికిత్స కోసం ఎల్వోసీ అవసరమైతే తమ వద్దకు రావాలన్నారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కుల బిల్లులను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాధితులు దరఖాస్తు చేసుకున్న వాటిలో వారు 60 శాతం పైగా ఇవ్వాలని కోరారు. అనంతరం మొత్తం 97 మంది లబ్ధిదారులకు రూ.21,43,000 విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, మల్లేష్ యాదవ్, మఠం పవన్, ఎర్రం సుధీర్, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, బంటు ప్రీతి ప్రవీణ్, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు చెందిన జిల్లా ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలి: దినేష్

**అక్షరటుడే, ఇందూరు:** సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఓఆర్ఆర్, బైపాస్ రోడ్డు హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్‌కు చెందిన జిల్లా ప్రజాప్రతినిధులు తక్షణమే రాజీనామాలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం.. జిల్లాకు ఔటర్‌రింగ్ రోడ్డు మంజూరు కాకపోవడం అత్యంత దురదృష్టకరమని దినేష్ ఆవేదన వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ , కాంగ్రెస్ నాయకులు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డిలు జిల్లాకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ముఖ్యమంత్రి హామీ అమలు కాకపోవడానికి నైతిక బాధ్యత వహిస్తూ వారు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాకు ఓఆర్ఆర్ తీసుకురాలేని ప్రజాప్రతినిధులకు పదవుల్లో కొనసాగే నైతిక హక్కు లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నాయకులకు జిల్లా అభివృద్ధిపై ఏమాత్రం శ్రద్ధ లేదని, తమ సొంత పార్టీ కార్యాలయం కోసం నగర నడిబొడ్డున స్థలాన్ని కేటాయించుకున్న వాళ్లు.. ప్రజలకు ఉపయోగపడే బస్టాండ్ కోసం మాత్రం స్థలాన్ని గుర్తించలేకపోయారని ఆయన ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ వెంటనే సీఎంతో మాట్లాడి ఓఆర్ఆర్ మంజూరు కోసం పోరాడాలని, లేకపోతే ఓఆర్ఆర్ రాకపోవడానికి ఆయనే కారణంగా చరిత్రలో మిగిలిపోతారన్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ఎంపీ అర్వింద్ నేతృత్వంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



## పోలీసుల కృషితో పాతికేళ్లకు సొంతింటికి చేరిన వృద్ధుడు



**అక్షరటుడే, కామారెడ్డి:** దాదాపు పాతికేళ్ల క్రితం తప్పిపోయిన ఓ వృద్ధుడు పోలీసుల కృషితో మళ్లీ సొంతింటికి చేరారు. జోగులాంబ గద్వాల్ జిల్లా పూటన్ పల్లికి చెందిన 65 ఏళ్ల సత్యనారాయణ చారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సత్యనారాయణ చారి 24 ఏళ్ల క్రితం తప్పిపోయాడు. గురువారం రాత్రి కామారెడ్డి పోలీస్ కానిస్టేబుల్ అశోక్, హోంగార్డు రవి పట్టణంలో తనిఖీలు నిర్వహిస్తుండగా కనిపించిన సత్యనారాయణ చారి దగ్గర వివరాలు సేకరించారు. అనంతరం కామారెడ్డి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే వారు గద్వాల్ పోలీస్ స్టేషన్‌కు వివరాలను అందజేయగా వారు కుటుంబ సభ్యులను కామారెడ్డికి పోలీస్ స్టేషన్‌కు పంపించారు. శుక్రవారం ఉదయం పట్టణ సీఐ నరహరి సమక్షంలో సత్యనారాయణ చారిని వారి కుమారులకు అప్పగించారు. వృద్ధుని ఆచూకీ కనుగొన్న సిబ్బందిని సీఐ అభినందించారు.

## చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది: సుదర్శన్ రెడ్డి

**అక్షరటుడే, భీమ్‌గల్ :** కొన్నిచోట్ల పంట ఆలస్యంగా చేతికి రావడంతో ధాన్యం కొనుగోళ్లలో స్వల్ప జాప్యం జరుగుతోందని, రైతులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆయన భీమ్‌గల్, వేల్పూర్, చెంగల్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికే లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించామని, మిగిలిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. గోదాముల కొరత ఉన్నందున దగ్గరలోని నిల్వ కేంద్రాలకు ట్రాక్టర్ల ద్వారా, దూర ప్రాంతాలకు లారీల ద్వారా ధాన్యాన్ని తరలించాలని అధికారులను ఆదేశించారు. రాజకీయ లబ్ధి కోసం కొందరు చేసే ప్రచారాన్ని నమ్మి రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవద్దని సూచించారు. భవిష్యత్తులో లాభసాటి వ్యవసాయం కోసం 8 రకాల సన్న బియ్యం రకాలను ప్రోత్సహిస్తామని, పామాయిల్ సాగుచేసే రైతులకు సబ్సిడీలు అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, సబ్ కలెక్టర్, డీసీసీ అధ్యక్షుడు నరేష్ రెడ్డి పాల్గొన్నారు.



## కార్పొరేటర్ టికెట్ పేరిట డబ్బులు వసూలు..!

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఇందూరు బీజేపీలో ఓ ఘటన కలకలం రేపుతోంది. ఇటీవల జరిగిన నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కొందరు చోటా నాయకులు టికెట్ల పేరిట డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. టికెట్ ఇప్పిస్తామంటూ కొందరు నాయకులు డబ్బులు తీసుకుని మోసం చేసినట్లుగా తెలుస్తోంది. తాజాగా ఈ విషయమై ఓ మహిళ బీజేపీ జిల్లా అధ్యక్షుడికి ఫిర్యాదు చేయడం రాజకీయంగా చర్చకు దారి తీసింది. తనకు కార్పొరేటర్ టికెట్ ఇప్పిస్తానని బీజేపీ నేత తన వద్ద డబ్బులు తీసుకుని మోసం చేశాడని బాధితులు మిర్యాల్కర్ గీత పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి కి ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు ప్రకారం.. కార్పొరేటర్ ఎన్నికల్లో 49వ డివిజన్ బీజేపీ టికెట్ ఇప్పిస్తానని బీజేపీ నాయకుడు బూసపు శంకర్ ఓ మహిళను సంప్రదించాడు. అతడి మాటలను నమ్మిన సదరు మహిళ శంకర్‌కు రూ. లక్ష ముట్టజెప్పింది. అంతేకాకుండా ప్రచారానికి కారు, ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు, నమూనా బ్యాలెట్‌కు డబ్బులు కావాలని చెప్పి అదనంగా మరిన్ని డబ్బులు వసూలు చేశాడు. అనంతరం నీకు టికెట్ కన్ఫాం అయ్యింది అంటూ సదరు మహిళను నమ్మబలికాడు. ఇలా నామినేషన్ చివరి రోజు వరకు నమ్మించి కాలం గడిపాడు. టికెట్ రాకపోవడంతో సదరు మహిళ బీజేపీ నాయకుడిని సంప్రదించింది. తనకు టికెట్ రానందున తన డబ్బులు తనకు వాపస్ ఇవ్వాలని కోరింది. అయినా స్పందించకపోవడంతో డబ్బుల కోసం నిలదీసింది. దీంతో సదరు నాయకుడు అసలు రూపం బయటపెట్టాడు. 'ఒక్క రూపాయి కూడా తిరిగి ఇవ్వను.. ఏం చేసుకుంటావో చేసుకో.. ఈ విషయం ఎవరైనా చెబితే నీ అంతు చూస్తా' అంటూ అతని తమ్ముడితో కలిసి బెదిరింపులకు దిగాడు. ఎక్కడ కనిపించినా తనను అసభ్యంగా దూషిస్తున్నాడని.. నా అంతుచూస్తానని బెదిరిస్తున్నాడని మహిళ తన ఫిర్యాదులో పేర్కొంది. దీంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడితో పాటు ఎమ్మెల్యే ధన్‌పాల్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించింది.



## పోలీసుగా నటిస్తూ డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తి అరెస్ట్



**అక్షరటుడే, నిజామాబాద్ రూరల్:** పోలీసుగా నటిస్తూ వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు నిజామాబాద్ రూరల్ పీఎస్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. నగర శివారులోని ఖానాపూర్ చౌరస్తా వద్ద పోలీసు అధికారిగా నటిస్తూ వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టుగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్పందించిన వారు అక్కడికి వెళ్లి చౌహాన్ గణేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లికి చెందిన చౌహాన్ పోలీసు దుస్తులు ధరించి వాహనదారుల నుంచి పత్రాలు తనిఖీ చేస్తున్నట్లుగా నటిస్తూ డబ్బులు వసూలు చేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పోలీసులు పట్టుకున్నారు. అనంతరం అతడిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిజామాబాద్ రూరల్ ఎస్‌హెచ్‌వో సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు.

## దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపి, వారిలోని సృజనాత్మకతను వెలికితీయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మద్ది చంద్రకాంత రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం సమగ్ర శిక్షతెలంగాణ, అలీంకో సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలోని సుమారు 200 మంది దివ్యాంగ విద్యార్థులకు వివిధ రకాల ఉపకరణాలు, బ్రెయిలీ కిట్లు, మొబైల్ ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఇప్ప ఉమారాణి, వైస్ ఛైర్మన్ కాసర్ల గోదావరి, కౌన్సిలర్లు, డీఈవో రాజు, సమగ్ర శిక్ష సమన్వయకర్తలు నాగవేందర్, వేణుగోపాల్, వెంకటరమణరావు, ఎంఈవోలు ఎల్లయ్య, పూర్ణచందర్ రావు, మెడికల్ ఆఫీసర్ విశ్వనాథ్, అలిమ్కో ప్రతినిధులు పాల్గొన్నారు.




ప్రయాణికులకు, బాటసారులకు నీడనివ్వడంతో పాటు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు దశాబ్దాల క్రితం నాటిన వృక్షాలను కొందరు స్వార్థపరులు ఇష్టారాజ్యంగా కాల్చేస్తున్నారు. ఎల్లారెడ్డి – కామారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న భారీ వృక్షాల మొదళ్లకు కొందరు కలప స్మగ్లర్లు నిప్పుపెడుతూ నేలకొరిగేలా చేస్తున్నారు. పంట పొలాలకు నీడ వస్తుందని కొందరు.. కలప అమ్ముకుంటే డబ్బులు వస్తాయని మరికొందరు నీడనిచ్చే చెట్లకు నిప్పుపెట్టి కూలుస్తున్నారు. – అక్షరటుడే, ఎల్లారెడ్డి



# చెట్లను కాల్చేస్తున్నారు..

■ పర్యావరణానికి పెనుముప్పు ■ కలప కోసం అక్రమార్కుల చీకటిదందా.. ■ రాత్రివేళల్లో భారీ వృక్షాలకు నిప్పు.. ■ నిద్రమత్తులో అధికారులు



ఎల్లారెడ్డి – కామారెడ్డి ప్రధాన రహదారిపై వందలాది వృక్షాలు ఉండగా, ప్రస్తుతం అవి పదుల సంఖ్యకు తగ్గిపోయాయి. ఇటీవల వడ్డెర కాలనీ సమీపంలో ఓ భారీచెట్టును కాల్చేయడంతో రోడ్డుపై కూలిపోయి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఇలా తరచూ కొందరు చెట్లకు నిప్పు పెడుతున్నా ఆర్అండ్‌బీ, అటవీశాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిందితులపై కఠినచర్యలు తీసుకోకపోవడంతో వృక్షాల విధ్వంసం యథేచ్ఛగా కొనసాగుతోంది.

### వాల్టా చట్టం ప్రకారం..

వాల్టా చట్టం ప్రకారం అనుమతి లేకుండా చెట్లు నరకడం, కాల్చడం నేరం. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంది. అయినా పర్యవేక్షణాలోపం, ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో వందల ఏళ్ల నాటి భారీ వృక్షాలు కనుమరుగవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మిగిలిన చెట్లను సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పర్యావరణ ప్రేమికులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే భవిష్యత్ తరాలకు ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పంట పొలాల్లో గడ్డిసైతం..

చేతికి వచ్చిన పంటను నూర్పిడి చేసిన అనంతరం పొలాల్లో మిగిలిన పంట వ్యర్థాలను, గడ్డిని అన్నదాతలు కాల్చేస్తున్నారు. మంట పెట్టిన అనంతరం రైతుల నిర్లక్ష్యం కారణంగా ఒక్కోసారి పొలాలను దాటుతున్న మంటలు రహదారుల పక్కన ఉన్న చెట్లకు సైతం అంటుకుంటున్నాయి. ఓ వైపు అక్రమార్కులు.. మరోవైపు కొందరు రైతుల అనాలోచిత పనుల వల్ల చెట్లు అగ్నికి ఆహుతవుతున్నాయి. పొలాలకు నిప్పు పెట్టకుండా మిగిలిన గడ్డిని దుక్కిలో కలిసేలా దున్నితే భూసారం పెరిగి పంట దిగుబడి అధికంగా వస్తుందని, భూమి నిస్సారంగా మారకుండా సారవంతంగా తయారవుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. అయితే రైతులు తక్కువ ఖర్చు, శ్రమతో పొలం శుభ్రం చేసుకునేందుకు గడ్డి కుప్పలకు నిప్పు పెడుతున్నారు. ఇలా పొలాలకు నిప్పు పెట్టడం వల్ల ఇటీవల మద్నూర్ మండలంలో వందల ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంటలు సైతం అగ్నికి ఆహుతయ్యాయి.

### అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం..

పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కలిగే నష్టాలు, విపత్తులపై రైతులకు అవగాహన కల్పించాల్సిన వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. పంట వ్యర్థాలను భూమిలోనే కలియదున్నడం, వాటిని కంపోస్ట్ ఎరువుగా, పశువుల దాణాగా వినియోగించుకోవడంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం పంట వ్యర్థాలు కాల్చడం నిషేధమని, ఉల్లంఘించిన వారికి జరిమానా విధిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నా క్షేత్రస్థాయి అమలవడం లేదు.

## ఆగ్రహంతో వేలు కొరికిన వ్యక్తి.. రిమాండ్‌కు తరలించిన పోలీసులు

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** చిన్నపాటి వాగ్వాదంలో ఓ వ్యక్తి ఎదుటి వ్యక్తి వేలు కొరికేశాడు. ఈ ఘటన ధర్పల్లి మండలం హొన్నాజీపేట్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హొన్నాజీపేట్ గ్రామానికి చెందిన మచ్చ శోభతో గ్రామానికి చెందిన పెద్ది రాకేష్ అనే వ్యక్తి అకారణంగా వాదనకు దిగాడు. సమాచారం తెలుసుకున్న శోభ భర్త పెద్ది బాలయ్య ఎందుకు తన భార్యతో గొడవకు దిగావని రాకేష్‌ను అడిగాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగగా ఆగ్రహంతో ఉన్న రాకేష్.. బాలయ్య ఎడమ చేయి మధ్య వేలును కొరికేశాడు. దీంతో వేలులో కొద్ది భాగం తెగి కింద పడిపోయింది. అనంతరం రాకేష్ సంఘటనా స్థలం నుంచి పారిపోగా బాలయ్యను ఆయన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులు రాకేష్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మలిదశ ఉద్యమకారుల ముందస్తు అరెస్ట్



**అక్షరటుడే, బాన్సువాడ:** హైదరాబాద్ లో శుక్రవారం సీఎం ఇంటిముట్టడి కార్యక్రమానికి మలిదశ ఉద్యమకారులు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బాన్సువాడ పట్టణంలో పోలీసులు ముందస్తుగా పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను ఆదుకుంటామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి మూడేళ్లు గడిచినా ఇప్పటివరకు తమ ఆశయాలను పట్టించుకోలేదని ఆరోపించారు. ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఎం ఇల్లు ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను జూన్ 2లోపు అమలు చేయాలని, లేనిపక్షంలో తదుపరి కార్యాచరణ మరింత తీవ్రంగా ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉడుత గంగాధర్ గుప్తా, మండల అధ్యక్షుడు గంజివార్ చందు, కాల్వ శ్యామ్, భాస్కర్ గౌడ్, ఎదుబాల్లే కృష్ణ, అగ్లవే దత్తు, గైని గంగారాం, పల్లికొండ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా ఆర్మూర్ పట్టణంలోని గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి హాజరై పుస్తక ప్రదర్శన తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థలను బలోపేతం చేసే లక్ష్యంతో విద్యాశాఖ తరపున ఇలాంటి ప్రత్యేక వారోత్సవాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ గ్రంథాలయంలో చదివిన ఎంతోమంది పాఠకులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారున్నారన్నారు. వారందరికీ అభినందనలు తెలియజేశారు. ప్రస్తుతం ఉన్న పాఠకులు కూడా మంచి ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌ఛార్జి స్వామి, విద్యార్థులు తదితరులు

## బండి భగీరథ్‌ను అరెస్ట్ చేసి శిక్షించాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెమ్మ డిమాండ్ చేశారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అమ్మాయిలపై అకృత్యాలకు పాల్పడిన కుమారుడిని ప్రోత్సహిస్తున్న కేంద్ర సహాయ మంత్రి తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని చూసుకొని మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారని ఆరోపించారు. కేంద్ర మంత్రి అయి ఉండి ఒక మైనర్ బాలికకు సంబంధించి నమోదైన పోక్సో కేసును తారుమారు చేసేందుకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బాధితురాలికి అండగా ఉండి, బాలిక కేసు విషయంలో నిష్పాక్షికంగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆర్మూర్ ఏరియా అధ్యక్షురాలు జి.పద్మ, ఏరియా కార్యదర్శి లక్ష్మి, ఏరియా నాయకురాలు యం.సునీత, ఎం.స్వారూప, ఇస్తారమ్మ, రేష్మ, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.




## నిర్లక్ష్యపు కారు డ్రైవింగ్‌కు నిండు ప్రాణం బలి..

**అక్షరటుడే,కోటగిరి:** డివైడర్‌ను కారు ఢీకొనగా ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన కోటగిరి మండలం ఎత్తొండ శివారులో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. కోటగిరి మండల కేంద్రానికి చెందిన యువకుడు ముత్తిపేట సాత్విక్ (19) మాశెట్టి ప్రతాప్ అనే వ్యక్తితో కారులో ఎత్తొండ వైపు వెళ్తున్నాడు. అయితే ఎత్తొండ క్యాంప్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు రాగానే డ్రైవర్ ప్రతాప్ అజాగ్రత్తగా కారు నడపడంతో డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో సాత్విక్ తల, పక్కటెముకలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని బోధన్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాత్విక్ శుక్రవారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

## ప్రభుత్వం వెంటనే వడ్లను తరలించాలి




**అక్షరటుడే, ఆర్మూర్:** కోతలు కోసి నెలరోజులైనా ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయడకపోవడం పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యమేనని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. మండలంలోని చేపూర్‌లో వడ్ల కుప్పలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడ్లు కాంటాలు కాకపోవడంతో ఐకేపీ, సొసైటీ, అధికారుల చుట్టూ రైతులు తిరిగి అలిసిపోతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే వడ్లను కాంటా చేసి రైస్‌మిల్లులకు తరలించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు గొల్ల గంగాధర్, ఎడ్ల ముత్తన్న, బొప్పారపు లింగన్న, నవీన్, మధు, రాజన్న, శ్రీకాంత్, భాజన్న తదితరులు పాల్గొన్నారు.

## బొల్లారం తండా ప్రమాద బాధితులకు పరామర్శ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి నియోజకవర్గం బొల్లారం తండాలో గ్రానైట్ రాళ్లు దింపుతున్న సమయంలో ప్రమాదవశాత్తు వ్యక్తులపై పడడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వారిని కామారెడ్డి మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న నానవత్ రాజు, చందర్ నాయక్‌లను శుక్రవారం నియోజకవర్గ నాయకులు వడ్డేపల్లి సుభాష్ రెడ్డి పరామర్శించారు. ఆస్పత్రికి వెళ్లిన ఆయన బాధితులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరిన సుభాష్ రెడ్డి, బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు



**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఐదోరోజు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్.సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం పుస్తక ప్రదర్శనలు, పుస్తక ఆవిష్కరణలు, థీమ్ ఆధారిత ప్రదర్శనలు 'బుక్ టాక్' వంటి విభిన్న కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రంథాలయ ఇన్‌ఛార్జ్ కె.లావణ్య పర్యవేక్షణలో లైబ్రరీ చరిత్రను ప్రదర్శించడంతో పాటు, క్రమం తప్పకుండా గ్రంథాలయాన్ని వినియోగించుకునే ఉత్తమ పాఠకులను గుర్తించి వారిని ఘనంగా సన్మానించారు. ప్రముఖ రచయిత, డాక్టర్ బి. శ్రీనివాస్ తన ఉదారతను చాటుకున్నారు. తానే స్వయంగా రాసిన సుమారు 30 పుస్తకాలను కళాశాల గ్రంథాలయం నిమిత్తం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పుస్తక సందర్శనను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.